అనాథ బాలలకు వరం..

ఆవాసీయ విద్యాలయం





తరగతి గదిలో శ్రద్ధగా చదువుకుంటున్న విద్యార్థులు

అక్కడ విద్యార్థులను చూస్తే చూడ ముచ్చటగా అనిపిస్తుంది. చక్కని యూనిఫాం ధరించి, క్రమశిక్షణతో విద్య నభ్యసిస్తున్నారు. ప్రైవేట్ విద్యాలయాలకు దీటుగా పదో తరగతిలో ఏటా శత శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. అలా అని వారేదో ఉన్నత కుటుంబాల్లో పుట్టి.. తల్లిదండ్రులు అల్లారుముద్దుగా పెంచుతున్న పిల్లలు కారు.. తల్లిదండ్రులు ఇద్దరూ లేని అనాథ బాలలు కొందరైతే.. తల్లిగానీ, తండ్రి గానీ లేని నిరుపేదలు ఇంకొందరు.. ఆదరణకు నోచుకోని వీధి బాలలు మరికొందరు.. వారికి చక్కని విద్యను, వసతిని కల్పిస్తూ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో భీమిలిలో నిర్వహిస్తున్న ఈ విద్యాలయమే ప్రభుత్వ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయం. రాష్ట్రంలో ఈ విద్యాలయాలు మూడు మాత్రమే ఉన్నాయి. వాటిలో నెల్లూరు, విజయవాడల్లో 1 నుంచి 8వ తరగతి వరకు మాత్రమే ఉండగా.. పదో తరగతి ఉన్న విద్యాలయం ఇది మాత్రమే కావడం విశేషం.

- పేద, అనాథ పిల్లలకు చక్కని విద్య, వసతి
- రాష్ట్రంలో మూడే విద్యాలయాలు
- పదో తరగతి వరకు ఉన్న విద్యాలయం ఇది మాత్రమే
- ఏటా శతశాతం ఉత్తీర్ణత

భీమునిపట్నం: నిరుపేద, అనాథ బాలలకు అత్యున్నత విద్యతో పాటు వసతి సదుపాయాన్ని అందిస్తూ అండగా నిలుస్తోంది భీమిలిలోని ప్రభుత్వ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయం. 2011లో అప్పటి ప్రభుత్వం పరవాడ మండలం డొంకాడ వద్ద ఈ విద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలో ప్రారంభంలో సుమారు 50 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 168 మంది ఉన్నారు. ఇందులో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. టెన్త్ విద్యార్థులు 32మంది ఉన్నారు. గతంలో ఈ విద్యాలయానికి శాశ్వత భవనం లేదు. భీమిలిలో అనువైన స్థలం ఉండడంతో ఇక్కడి మహిళా పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో శాశ్వత భవనాన్ని నిర్మించి, 2019 అక్టోబర్‌లో ప్రారంభించారు. ఇక్కడ అనాథ బాలలకు, తల్లిగానీ, తండ్రిగానీ మాత్రమే ఉన్న నిరుపేదలకు, వీధిబాలలకు అవకాశం కల్పిస్తున్నారు. పాఠశాలతో పాటు వసతి ఇదే భవనంలో ఉంటుంది. ఇక్కడ 11మంది ఉపాధ్యాయులు, వార్డెన్, కుక్‌లు, ఏఎన్‌ఎం, అటెండర్లు, వాచ్‌మెన్ మొదలైన 9మంది సిబ్బంది ఉన్నారు. ఇందులో 5 తరగతి గదులతోపాటు, విద్యార్థులు పడుకునేందుకు రెండు గదులు ఉండగా, దానిలోనే వారి సామగ్రి భద్రపరుస్తున్నారు.

ప్రత్యేక పర్యవేక్షణ.. కౌన్సెలింగ్

ఇక్కడికి వచ్చే పిల్లలు భిన్న మనస్తత్వాలు, ప్రవర్తనతో ఉంటారు. వసతి కూడా ఇక్కడే కావడంతో వారి ప్రవర్తన, క్రమశిక్షణ విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అవసరమైన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వ్యక్తిత్వ వికాసం కోసం సత్యసాయి ట్రస్ట్ ద్వారా బాల వికాస్ తరగతులు నిర్వహిస్తున్నారు. తరగతి గదులు, డార్మిటరీలు, వంటశాల, భోజనశాలతో పాటు పరిసరాలను ఎంతో పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

విద్యార్థుల విజయభేరి

ఇక్కడి ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులందరూ మంచి మార్కులు సాధిస్తున్నారు. పదో తరగతిలో ఏటా నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. గత సంవత్సరం ఏడో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎ.నవీన్, పి.పూర్ణతేజ్ అత్యధిక మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. వీరికి రోటరీ క్లబ్ రూ.12వేల చొప్పున స్కాలర్‌షిప్‌ను అందించింది. విద్యార్థులు ఆటల పోటీల్లోనూ ఉత్సాహంగా పాల్గొంటూ విజయాలు సాధిస్తున్నారు.



రోటరీ క్లబ్ స్కాలర్‌షిప్‌లు పొందిన నవీన్, పూర్ణతేజ

ప్రవేశాలు ఇలా..

విద్యాలయంలో పని చేసే ఉపాధ్యాయులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో వీధి బాలలను, అనాథలను, సంరక్షణ అవసరమైన పిల్లలను గుర్తించి తీసుకుంటారు. అలాగే ప్రభుత్వ ఉపాధ్యాయులు నిర్వహించే సర్వేలో అర్హులు ఉంటే సమాచారం ఇస్తారు. ఆరో తరగతిలోనే ఎక్కువ మందికి అవకాశం ఉంటుంది, మిగిలిన తరగతుల్లో అవకాశాలను బట్టి ప్రవేశం కల్పిస్తారు.



విద్యార్థులు పడుకునే గది, డార్మిటరీ

సమస్యలివీ..

- ఇక్కడ మోటారు ద్వారా నీటి వినియోగం జరుగుతోంది. ఎక్కువ సేపు విద్యుత్ సరఫరా నిలిచినా, మోటారు పని చేయకపోయినా విద్యార్థులకు ఇబ్బందవుతోంది. బోర్ వెల్ ఏర్పాటు చేయాల్సి ఉంది.
- ఇక్కడ క్రీడామైదానం లేదు. ఖాళీప్రదేశం గోతులతో ఉండడంతో చదును చేయాల్సి ఉంది. కొంతకాలం క్రితం వరకు దగ్గరలోని ప్రైవేట్ స్థలాల్లో విద్యార్థులు ఆటలు ఆడేవారు. ఇప్పుడు ఆ అవకాశం లేదు.
- మంచినీటికి ఆర్వో ప్లాంట్ పాడైంది. దానికి మరమ్మతులు చేయాలి.
- కార్యక్రమాల నిర్వహణకు వేదిక అవసరం

మెనూ ఇలా..

రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి పౌష్టిక విలువల ఆహారం అందించడంతో పాటు సాయంత్రం పాలు, బిస్కెట్లు అందిస్తున్నారు. ఇక్కడ అవసరమైన సరకులు, కూరగాయలతో పాటు ఇతర సామగ్రిని ప్రభుత్వం ఎంపిక చేసిన సంగమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఇక్కడికి అందుతాయి. దాని నిర్వాహకులు బి.మంగపతిరావు వాటిని పర్యవేక్షిస్తున్నారు.



భోజనాలు చేస్తున్న విద్యార్థులు

రూ.66 లక్షలతో నాడు-నేడు పనులు

ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు కింద రూ.66లక్షలతో పనులు నిర్వహించారు. అందులో భాగంగా అదనంగా రెండు తరగతి గదుల నిర్మాణం, అందరికి సరిపడా మరుగుదొడ్లు, మంచినీరు అందించే ఆర్వో ప్లాంట్ మొదలైన వసతులు కల్పించారు. విశాలమైన ప్రాంగణానికి రక్షణ గోడ నిర్మించారు.



నాడు–నేడులో నిర్మించిన రక్షణ గోడ

బాగా చూసుకుంటున్నారు



మా అమ్మానాన్న లేరు. నానమ్మ ఆరో తరగతిలో నన్ను ఇందులో చేర్పించారు. అప్పటి నుంచి ఇక్కడే చదువుకుంటున్నా. ఇక్కడ ఉపాధ్యాయులు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పిస్తున్నారు. బాగా చదువుకుని మంచి మార్కులు సాధిస్తున్నా. భోజనం, వసతులు కూడా బాగున్నాయి.

– ఎ.రాంబాబు, 10వ తరగతి, గొలుగొండ

ఫుడ్ బాగుంటుంది



మా నాన్న ఆటో డ్రైవర్. అమ్మ లేదు. ఇక్కడ భోజనం, టిఫిన్లు బాగుంటాయి. ఉండటానికి, చదువుకోవడానికి ఇబ్బంది లేదు. క్రీడల్లోనూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు.

– వి.మోహన్, 9వ తరగతి, పి.భీమవరం, వద్దాది

రోటరీ క్లబ్ స్కాలర్‌షిప్ వచ్చింది



నాకు అమ్మ లేదు. నాన్న వ్యవసాయ కూలి. బాగా ఆర్థిక సమస్యలు ఉండడంతో స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఆరో తరగతిలో ఇక్కడ చేరాను. టీచర్లందరూ చాలా బాగా చెప్పడంతో పాటు బాగా ప్రోత్సహిస్తున్నారు. మాకు మంచి సలహాలు, సూచనలు ఇస్తుంటారు. వారి ప్రోత్సాహంతోనే ఏడో తరగతిలో మంచి మార్కులు సాధించాను. రోటరీ క్లబ్ స్కాలర్‌షిప్ పొందాను.

– ఎ.నవీన్, 8వ తరగతి, తారువ, దేవరాపల్లి

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం



ఇక్కడ ఉంటున్న విద్యార్థులను నిరంతరం పర్యవేక్షిస్తుంటాం. వీరి ప్రవర్తనను గమనిస్తుంటాం. పెద్దలను గౌరవించడం, మంచిగా మాట్లాడటం అన్నీ నేర్పిస్తున్నాం. ఆహారం విషయంలో రాజీ పడడం లేదు. మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన ఆహారం అందిస్తున్నాం.

– బి.మంగపతిరావు, సంగమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకుడు

ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నాం



ఇక్కడి విద్యార్థుల బోధన, క్రమశిక్షణ, భోజనం, వసతి అన్ని విషయాల్లో ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు వారి చదువుల సామర్థ్యం పరీక్షిస్తూ అవసరమైన మేరకు మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఉపాధ్యాయులు, సిబ్బందితో సహా అందరూ సొంత పిల్లల్లా చూసుకుంటున్నారు. వారంతా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తుండటం మాకు చాలా ఆనందంగా ఉంటుంది.

– డాక్టర్ జె.చంద్రశేఖరరావు, సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్

క్లుప్తంగా

ఘనంగా నూకాలమ్మ పాలిమేర ఉత్సవం



అమ్మవారి గరగ ఊరేగింపు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి పాలిమేర ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఉత్సవాలు 27 నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇటీవల చాటింపు వేడుక జరిగింది. అనంతరం అమ్మవారి గరగను మెయిన్‌రోడ్డు సమీపంలోని చదునుపట్టు వద్ద ఉంచారు. ఇప్పుడు అక్కడి నుంచి గరగను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపుగా ఊరి పొలిమేరకు దాటించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

క్షయ వ్యాధికి అందుబాటులో చికిత్స



ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది

భీమునిపట్నం: క్షయవ్యాధికి చికిత్స అందుబాటులో ఉందని భీమిలి సీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఫణికుమార్ అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యులు, సిబ్బంది సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు ఈ వ్యాధి ప్రాణాంతకమైందని, కానీ ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. స్థానిక టీబీ సెంటర్‌లో మందులు అందుబాటులో ఉన్నాయని, అవి జాగ్రత్తగా వాడితే రోగి సంపూర్ణ ఆరోగ్యవంతుడు అవుతాడని తెలిపారు. క్షయవ్యాధి విభాగ సిబ్బంది చక్రవర్తి, ప్రేమ్‌కుమార్, మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

మధురవాడ: క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీపీ ఆస్పత్రి పల్మనాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శైలేంద్ర చక్రవర్తి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో విద్యార్థులు, మధురవాడ పీహెచ్‌సీ టీబీ యూనిట్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా క్షయవ్యాధి నివారణ మార్గాలపై ఆస్పత్రి యాజమాన్యం వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతకు రూ.5వేలు బహుమతిని అందించింది. కార్యక్రమంలో టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్లు వీర బ్రహ్మం, సురేష్, గోపీనాథ్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌కు 'దివీస్' ఫర్నిచర్



పాలకవర్గానికి ఫర్నిచర్ అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు దివీస్ లేబరేటరీ యాజమాన్యం సోమవారం రూ.90 వేల విలువైన ఫర్నిచర్ అందించింది. ఇందులో మందులు భద్రపరచుకునేందుకు బీరువాలు, రోగులు కూర్చుకునేందుకు కుర్చీలు, సేఫ్టీ గ్రిల్స్ ఉన్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య రామకృష్ణారెడ్డి, వైద్యులు వైడీ కల్యాణి, బి.రవీంద్ర నాయక్, స్థానిక పెద్దలు కొయ్య చిట్టి రామకృష్ణ, కొయ్య అప్పలచిట్టి, నగిరెడ్ల రమణ, వెంపాడ అచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పడాల రమణ, దివీస్ సీఎస్ఆర్ ఇన్‌చార్జి ఎ.శ్రీనివాస్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండాడలో కేవీబీ నూతన శాఖ ప్రారంభం



ప్రారంభిస్తున్న సీజీఎం దివాకర్

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన శాఖ సోమవారం ప్రారంభమైంది. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీజీఎం దివాకర్ ఈ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేవీబీ సేవలు ఈ ప్రాంతవాసులకు అందించడానికి బ్యాంక్ శాఖను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ బ్రాంచ్ పొదుపు, కరెంటు ఖాతాలతో సహా డిపాజిట్లు, రుణాల వంటి సమగ్రమైన బ్యాంకింగ్ సేవలు అందిస్తోందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈ బ్యాంక్ 42 శాఖలను కొత్తగా ఏర్పాటు చేసిందని, దీనితో కలిపి మొత్తం 884కు పెరిగిందని తెలియజేశారు.

వసతులు కల్పించాలని కాలనీ వాసుల నిరసన



జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీవాసులు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది ఎస్సీ కాలనీలో వసతులు కల్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో వారు సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు డి.అప్పలరాజు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సియాద్రి పైడితల్లి మాట్లాడుతూ కాలనీలో కనీసం మరుగుదొడ్లు కూడా లేక మహిళలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం అన్నారు. రోడ్లు, కాల్వలు, వీధిలైట్లు సక్రమంగా లేవన్నారు. పాలకులు పట్టించుకోవడం లేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.పుష్ప, ఎం.ఆదిలక్ష్మి, పైడమ్మ, నాయకులు ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంపాలెం రోడ్డు పనులు పూర్తి చేయాలి

- జోనల్ కమిషనర్‌కు వినతి
- జోన్–2 పీజీఆర్ఎస్‌కు 21 అర్జీలు



నగరంపాలెం రోడ్డు పనులు పూర్తి చేయాలని జెడ్సీకి వినతి ఇస్తున్న వివిధ పార్టీల నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 5, 7 వార్డుల మధ్య మధురవాడ హైవే నుంచి సాక్షి కార్యాలయం వరకు ఉన్న నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వివిధ పార్టీల నాయకులు, స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు మాత్రం సక్రమంగా స్పందించడం లేదు. తాజాగా దీనిపై సీపీఐ నాయకుడు సత్యనారాయణ, టీడీపీ నాయకుడు వాంద్రాసి అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు యువకులు పీజీఆర్ఎస్‌లో జెడ్సీ కనకమహాలక్ష్మికి సోమవారం ఫిర్యాదు ఇచ్చారు. ఈ రోడ్డుతో పాటు నగరంపాలెం–వాంబేకాలనీ రోడ్డును కూడా పూర్తి చేయాలని, నగరంపాలెం తుఫాన్ షెల్టర్ నుంచి సాక్షి కార్యాలయం వైపు ఊరు వెలుపలి నుంచి టీడీఆర్ ఇచ్చిన భూముల్లో నుంచి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. ఇలా జోన్ పరిధిలోని 9 వార్డుల్లో పలు సమస్యలపై అర్జీదారులు 21 వినతులు అందించారు. వాటిని స్వీకరించిన జెడ్సీ త్వరలోనే చర్యలు చేపడతామని తెలిపారు.

భీమిలిలో 6 వినతులు

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సోమవారం జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆరు వినతులు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, రెవెన్యూ విభాగానికి రెండు, యూడీసీ విభాగానికి, ఇంజినీరింగ్ విభాగానికి ఒక్కొక్క వినతి వచ్చాయని జెడ్సీ తెలిపారు. వీటిని పరిశీలించి, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.

స్టేడియం వద్ద సందడి

స్టేడియం వద్ద అభిమాన క్రీడాకారుల జెర్సీలు కొనడానికి పోటీ పడుతున్న అభిమానులు



ఏలూరు చిన్నోడు రుత్విక్

వాటర్ పెయింటింగ్ వేయించుకుంటున్న యువకుడు

పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద సోమవారం సందడి నెలకొంది. ఢిల్లీ క్యాపిటల్స్ – లక్నో సూపర్ జెయింట్స్ ఐపీఎల్ టీ–20 క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చిన అభిమానులు జోష్ నింపారు. నిండా నాలుగేళ్లయినా లేని ఏలూరుకు చెందిన రుత్విక్ తాను క్రికెటర్ అవుతానంటూ బాల్ ఎలా వేయాలో చూపిస్తూ సందడి చేశాడు. స్టేడియం వద్ద అభిమాన క్రీడాకారుల జెర్సీలు కొనడానికి అభిమానులు పోటీ పడ్డారు. – పీఎం పాలెం

టిడ్కో ఇళ్ల మౌలిక వసతులకు మార్గం సుగమం

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లోని రెండు కాలనీల్లో గల 576 టిడ్కో ఇళ్లకు మౌలిక వసతుల కల్పనకు మార్గం సుగమమైంది. ఈ మేరకు టిడ్కో ఏఈ జి.జయబాబు సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో జెడ్సీ కె. కనక మహాలక్ష్మిని కలిసి హ్యాండింగ్ ఓవర్ లెటర్ అందజేశారు. ఇందులో వాంబేకాలనీ సుద్ద గెడ్డ వద్ద గల 5 బ్లాకుల్లో ఉన్న 240, కొమ్మాది వద్ద 7 బ్లాకుల్లో ఉన్న 336ఇళ్లు జీవీఎంసీకి అప్పగించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యా యి. గతంలో నామమాత్రంగా జరిగినా అన్ని లెటర్స్ అందించ లేదు. దీంతో ఈ నివాసాలకు కరెంట్, కుళా యి కనెక్షన్లు, జీవీఎంసీ కల్పించాల్సిన ఇతర సదుపాయాల కల్పనకు ఇబ్బందులు తలెత్తాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు టిడ్కో ఏఈ జయబాబు, జెడ్సీతో పాటు తాగునీటి విభాగం ఏఈలకు లెటర్ అందించారు.

యువతలో ప్రజాస్వామ్య విలువలు బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికిరణ్

కొమ్మాది: యువతలో ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అదనపు డైరెక్టర్ జనరల్ ఇ.రవికిరణ్ అన్నారు. వికసిత భారత్ 2047లో భాగంగా గీతం వేదికగా సోమవారం నిర్వహించిన నేషనల్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్–2025ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ సమస్యలపై క్రమశిక్షణతో కూడిన చర్చలను ప్రోత్సహించడం, విభిన్న అభిప్రాయాలను గౌరవించే సంస్కృతిని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

తగరపువలస: పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ (ఓల్డ్ భీమిలి) ఫెలోషిప్ నూతన అధ్యక్షుడిగా డి.విక్టర్ డేవిడ్ ఎన్నికయ్యారు. భీమిలిలో 2025–27 కాలానికి గాను పాస్టర్స్ అడ్వైజర్స్ పీఎస్ శ్యాంబాబు, తిమోతీ బాబీ, సువర్ణరాజు అధ్యక్షతన సోమవారం ఎన్నికలు జరిగాయి. భీమిలి చుట్టుపక్కల ప్రాంతాలలో పరిచర్య చేస్తున్న సేవకులు ఇందులో పాల్గొని, ఓటుహక్కు వినియోగించుకున్నారు. అసోసియేషన్ కార్యదర్శిగా జి.జాన్, కోశాధికారిగా ఎస్.మోజెస్, వీరికి సహాయకులుగా ఇరిమ్మియా, బి.శామ్యూల్‌రాజు, వసంత్‌పాల్‌లను ఎన్నుకున్నారు. మరో అడ్వైజర్‌గా బి.సువార్తరాజును తీసుకున్నారు.

మారుపేరు కార్మికుల పీఎఫ్, పెన్షన్లు చెల్లించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో మారుపేరు కార్మికులకు సంబంధించిన పీఎఫ్, పెన్షన్ల చెల్లింపునకు సహకరించాలని కోరుతూ కాంగ్రెస్ కార్మికసంఘం ప్రతినిధులు మర్రిపాలెంలోని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు.

సంఘం ప్రతినిధులు జేవీ కైలాస్‌రెడ్డి, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో మిల్లులో పనిచేసే కార్మికులకు సీనియారిటీ ప్రకారం వారసత్వంగా ఉద్యోగాలు ఇచ్చేవారన్నారు. కుమారులు లేని కార్మికులు ఆ హక్కును తమ బంధువులకు అప్పగించేవారన్నారు. అలా మారుపేర్లతో మిల్లులో పని చేసిన వారికి ఆధార్ కార్డులు ప్రవేశపెట్టిన నాటి నుంచి చెల్లింపులు చెల్లింపులు జరగడం లేదన్నారు. దీంతో చాలామంది కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మారుపేరు కార్మికులందరికీ చెల్లింపులు అయ్యేలా పరిష్కారం చూపాలన్నారు. దీని కోసం మారుపేరు కార్మికుల జాబితాను వినతిపత్రానికి జత చేసినట్టు తెలిపారు.

10డీ దరఖాస్తుల ఆన్‌లైన్‌కు వినతి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లులో 300 నుంచి 350 మంది కార్మికుల పెన్షన్ కోసం 10డీ దరఖాస్తులు చేసుకుని అయిదేళ్లు అవుతున్నా ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయలేదని చిట్టివలస ప్రాంత ఈపీఎఫ్ పెన్షనర్ల సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సోమవారం మరోమారు మిల్లు ప్రతినిధి రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ సర్వీస్ పూర్తి చేసినా పెన్షన్ రాకపోవడంతో చాలామంది విరమణ కార్మికులు ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో మంచం పట్టారన్నారు. గతంలో పీఎఫ్ అధికారుల సూచనల మేరకు కార్మికులు 10డీ దరఖాస్తులు చేసుకున్నట్టు గుర్తు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం ఈ దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తే చివరిదశలో ఉన్న కార్మికులు పెన్షన్ అయినా పొందగలుగుతారన్నారు. వినతి అందించిన వారిలో పెన్షనర్ల సంఘం ప్రతినిధులు కానూరి రాంబాబు, దామోదర బాబాజీ, మోర అప్పలరాజు, సింగిడి అప్పారావు, పంపాన సూర్యనారాయణ ఉన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం ప్రజా చైతన్యయాత్ర

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డులో సోమవారం సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఇంటింటా తిరుగుతూ సమస్యలపై సర్వే నిర్వహించారు. చాలామంది అర్హులు అయినా ప్రభుత్వం అందించే గృహ పథకం తమకు రాలేదని తెలిపారు. వసతుల నిమిత్తం అధికారులు రూ.35వేల వంతున వసూలు చేశారని కొందరు తెలియజేశారు. తమకు పెన్షన్లు రాలేదని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, పక్షవాత బాధితులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, రీసు నరసింగరావు, జోగ వెంకటరావు, గుజ్జు నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు గడువు నేడు

పద్మనాభం: చంద్రన్న స్వయం ఉపాధి పథకానికి దరఖాస్తు గడువు ఈ నెల 25తో ముగుస్తుందని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి కాపు, ఈబీసీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రాయితీతో కూడిన బ్యాంకు రుణాల కొరకు గడువు ఈ నెల 22తో ముగిసినా.. 25 వరకు పెంచినట్లు పేర్కొన్నారు. కాపు కార్పొరేషన్‌కు సంబంధించి రుణాలకు అర్హత వయసు 50 నుంచి 60కు పెంచినట్లు తెలిపారు.